క్లుప్తంగా

వైభవంగా గుబ్బాలమ్మ శాకంబరి ఉత్సవాలు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి శాకంబరి ఉత్సవాలను రెండో రోజు మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలు, పండ్లు, వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినీమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కొవ్వూరు పట్టణంలో షాపులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ

తాళ్లపూడి(కొవ్వూరు): కళాశాలలు, పాఠశాలల సమీపంలో విద్యార్థులకు ఎటువంటి మత్తు పదార్థాలు విక్రయాలు చేయరాదని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ దుకాణదారులను హెచ్చరించారు. కొవ్వూరు పట్టణంలో మంగళవారం పలు ప్రాంతాల్లో కళాశాలలు, పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో ఉన్న వివిధ దుకాణాలను, పాన్ షాపులను సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయాలు చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఆయన వెంట టౌన్ సీఐ విశ్వం, సిబ్బంది ఉన్నారు.

ఖరీఫ్ సాగు మెళకువలపై అవగాహన

తాళ్లపూడి(కొవ్వూరు): మండల వ్యాప్తంగా ఖరీఫ్ సాగుకు ముమ్మరంగా నారుమళ్ల పనుల్లో రైతులు నిమగ్నం అవ్వడంతో పంట అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై సహాయ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు రైతులకు అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొవ్వూరులో నిర్వహించారు. 36 కిలోల నత్రజని (యూరియా 78 కిలోలు) మూడు సార్లు సమాన భాగాలుగా ఆఖరి దమ్ములో, దుబ్బు చేసే దశలోను, అంకురం దశలో వేయాలన్నారు. 24 కిలోల భాస్వరం (150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) ఆఖరి దమ్ములో, 24 కిలోల పొటాష్ (40 కిలోల మ్యూరేయేట్ ఆఫ్ పోటాష్) రేగడి నేలలో ఒకేసారి ఆఖరి దమ్ములో, తేలిక నేలల్లో 2 సార్లు అంకుర దశలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎ.గంగాధర్, విస్తరణ అధికారి వరలక్ష్మి, నవీన్, రైతులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు



మేజర్ డ్రైనేజీలోకి దూసుకుపోయిన బస్సు

నిడదవోలు: మండలంలోని సమిశ్రగూడెం శివారున కాలువ గట్టు వద్ద మంగళవారం నారాయణ స్కూల్ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న మేజర్ డ్రైనేజీలోకి దూసుకుపోయింది. నిడదవోలు పట్టణం నుంచి విద్యార్థులను ఎక్కించుకుని సమిశ్రగూడెం గ్రామంలోకి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో పది మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉండటంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫసల్ బీమా పథకంతో రైతులకు లబ్ధి



రైతులతో వ్యవసాయ సిబ్బంది

చాగల్లు: మండలంలోని మల్లవరం, గౌరిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ అధికారి కె.వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి వివరిస్తు తుపాన్, కరవు, ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన రైతులకు ఈ పథకం ఉపయోగకరమన్నారు. పథకం కింద రైతుకు ఎకరానికి రూ.570 ప్రీమియాన్ని గడువు తేదీ ఆగస్టు 15 లోపు చెల్లించాలని, అరటి రైతులు ఎకరానికి ప్రీమియం రూ.3,036ను జూలై 15 లోపు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు.



యర్నగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తానేటి వనిత, పార్టీ నేతలు



అన్నదేవరపేటలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు



పెద్దేవంలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు, ఎంపీపీ తదితరులు



జీడిగుంటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి వనిత

సంక్షేమ సారథి- అభివృద్ధి వారధి

- వాడవాడలా వైఎస్సార్ జయంతి వేడుకలు
- ఆయన పాలన స్వర్ణయుగం
- కాంగ్రెస్‌ను రాజకీయంగా నిలబెట్టిన శక్తి
- ఆయన ఆశయాల సాధనకై జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలి

దేవరపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత అన్నారు. నియోజకవర్గంలోని నల్లజర్ల, ద్వారకాతిరుమల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వాడవాడలా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవరపల్లి మండలం యర్నగూడెం, నల్లజర్ల గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ వీరకుమారి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం వనిత మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాజన్న పరిపాలన స్వర్ణయుగంలా ప్రజలందరికి గుర్తుండిపోయిందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో మనసున్న పేదల పెన్నిధిగా రాజశేఖరరెడ్డికి మించిన ముఖ్యమంత్రి మరొకరులేరని కొనియాడారు. 108 అంబులెన్స్, ఆరోగ్యశ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్ వంటి పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు ఎనలేని సేవలు అందించిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమాల్లో నల్లజర్ల, దేవరపల్లి, ద్వారకాతిరుమల మండలాల పార్టీ అధ్యక్షులు వెల్లంకి సుబ్రహమణ్యం, కూచిపూడి సతీష్, ప్రతాపనేని వాసుబాబు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు వై.లక్ష్మి, కడలి హైమావతి, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు సాలి వేణు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వల్లభనేని సత్యనారాయణ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నక్కా పండు, గ్రామ సర్పంచ్ పల్లి జ్యోతి, పార్టీ జిల్లా కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, సహాయ కార్యదర్శి గడా రాంబాబు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిబోయిన గంగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధన రావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చెరగని ముద్ర

తాళ్లపూడి: అన్ని వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి పేదప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడి మండలంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, కేక్‌లు కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు, అన్నదేవరపేట, పెద్దేవంలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. పెద్దేవంలో 50 మంది వృద్ధులకు దుస్తులు, జెడ్పీ ఉన్నత పాఠశాల 200 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను తోట రామకృష్ణ ఆధ్వర్యంలో తలారి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, తోటరామకృష్ణ, కవల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి వనిత, నాయకులు

పేదల జీవితాల్లో
ప్రజల గుండెల్లో వైఎస్సార్ సజీవం

నిడదవోలు రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలతో నేటికి ప్రజల గుండెల్లో సజీవంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. నిడదవోలు మండలం కంసాలిపాలెం, జీడిగుంట, కోరుమామిడి, కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి, పెండ్యాల, అట్లపాడు గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించి, పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తిమ్మరాజుపాలెంలో పార్టీ నాయకులు యాళ్ల రామారావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు మొక్కరాల శ్రీనివాస్, ముప్పిడి చంద్రశేఖర్, తిక్కా శ్రీను, ఎంపీటీసీ సభ్యులు మలిశెట్టి వీరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో సుస్థిర స్థానం

నిడదవోలు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలుపరచి పేదల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ యలగడ బాలరాజు అన్నారు. పట్టణ పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ 76వ జయంతిని పురస్కరించుకుని వేడుకలను నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో వైఎస్సార్ నగర్‌లో విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమంలో నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు వెనగన పోలయ్య, కౌన్సిలర్లు పడాల శిరిష, దాకే అనిల్‌కుమార్, ఆకుల ముకుందరావు, పగడాల రవి కిరణ్, ఎస్‌కే ఛాన్‌భాషా, పులిమంతుల రామారావు, గజ్జరపు రమేష్, కొండపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో



ముక్కామలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

స్థానిక పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడవరపు భద్రందొర అధ్యక్షతన దివంగత మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా పేదలు, దివ్యాంగులకు దుప్పట్లు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం భద్రందొర మాట్లాడుతూ 108 అంబులెన్స్, ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలతో వైఎస్సార్ పేదల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని కొనియాడారు.

రాజన్నకు వైఎస్సార్ సీపీ శ్రేణుల నివాళి

ఉండ్రాజవరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహమండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ ఎన్.సరోజిని, సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణవర్, నిమ్మన శ్రీనివాసు, మోర్తలో వైసీపీ నాయకులు ఆలపాటి నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్ చిటికెన సుజని, ఎంపీటీసీ సభ్యురాళ్లు జానీ నాగలక్ష్మి, వెలిగట్ల రాణి, ఉప సర్పంచ్ దాపర్తి రామ సందీప్, గ్రామ వైసీపీ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు, పాలంగిలో సర్పంచ్ బొక్క శ్రీనివాసు, మాజీ ఎంఎంసీ వైస్ చైర్మన్ వేలిచేటి జానకీరామయ్య, తాడిపర్రులో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, వైసీపీ గ్రామ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దేశానికే తలమానికంగా సంక్షేమ పథకాలు

పెరవలి: వైఎస్సార్ లాంటి ముఖ్యమంత్రి మరొకరు ఉండరని ఆయన పరిపాలన సంక్షేమ పథకాల రూపంలో ప్రజల మనసుల్లో సుభిక్షంగా ఉన్నాయని అటువంటి మహనీయుడు నేడు లేకపోవడం దురదృష్టమని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని ముక్కామలలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకంతో వేలాదిమంది విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు గండేపల్లి రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వీరమళ్లు సత్యనారాయణ, పంపన అంజి, కరుటూరి గోపి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయుడు

గోపాలపురం: తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఏకైక నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని రాష్ట్ర మాజీ హోంమంత్రి క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత అన్నారు. మంగళవారం డాక్టర్ వైఎస్సార్ 76వ జయంతిని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి తెలుగు రాష్ట్రాల హృదయాల్లో చెరగని ముద్రవేశారన్నారు. గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్, వైజంక్షన్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలను, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

వెలుగులు నింపిన మహానుభావుడు

- కొవ్వూరులో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

చాగల్లు(కొవ్వూరు): పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో కృషి చేశారని, పేదల జీవితాలలో వెలుగులు నింపిన మహానుభావుడని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాల కృష్ణ అన్నారు. కొవ్వూరు లీటరరీ క్లబ్‌లో వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాలు పాల్గొని ప్రారంభించారు. అనంతరం వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పేదలకు ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఫీజు రియింబర్స్‌మెంటు, పావలా వడ్డీలకే రుణాలు వంటి పథకాలను అమలు చేసి పేదల మనస్సులో సుస్థిరస్థానం ఏర్పాటు చేసుకున్నారన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ దేశంలో తక్కువ వ్యవధిలో రాజకీయచరిత్రలో తనకంటు ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. సంక్షేమానికి మారుపేరుగా ఐదు సంవత్సరాలే ముఖ్యమంత్రిగా పనిచేసిన రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధి చెందేలా కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందుబాటులో తీసుకువచ్చిన మహానుభావుడు వైఎస్సార్ అన్నారు. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు, ఆరోగ్యశ్రీ, 108, ఉచిత గృహాలు వంటి సంచలనాత్మకమైన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. అనంతరం ఇరువురు మాజీ ఎమ్మెల్యేలు స్వయంగా రక్తదానం చేయగా శిబిరంలో మొత్తం 80 మంది రక్తదానం చేశారు. ఆనంతరం భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు జి.శ్రీనివాసరెడ్డి, జక్కంపూడి బ్లడ్ సెంటర్ నిర్వాహకురాలు రాజేశ్వరి, అనపర్తి, రాజమండ్రి, రాజానగరం ,నియోజకవర్గాల యువజన విభాగాల అధ్యక్షులు పడాల దుర్గారెడ్డి, కొత్తపల్లి శివాజీ,పి.శ్రీనివాస్, బిల్డర్ చిన్న, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు విజయరెడ్డి, చేకూరి మణికంఠ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కొవ్వూరులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, పార్టీ నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఉండ్రాజవరం: దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్లు బి.దుర్గా మహేశ్వరరావు, ఆర్.ఉషాదేవి అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవాలు సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీలో వ్యాధిపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. జ్వరంతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి తగిన రక్త పరీక్షలు చేయించుకుని, అవసరమైన మందులు సకాలంలో వాడాలన్నారు. ఇంటి పరిసరాలల్లో చెత్త, మురుగు నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే నిర్వహించాలన్నారు. సీహెచ్‌వో సుబ్రమణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కుమారి, ఆరోగ్య పరివేక్షకులు శ్రీరామమూర్తి, రత్నకుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో డెంగీపై ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

క్షయ నివారణకు దాతలు స్పందించాలి

పెరవలి: టీబీ రోగులకు పౌష్టికాహార నిమిత్తం దాతలు ముందుకు వచ్చి కిట్లు అందించటం చాలా ఆనందంగా ఉందని కొవ్వూరు డివిజన్ టీబీ యూనిట్ అధికారి ఎస్.టి ఆశ్యాజ్యోతి తెలిపారు. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో రోగులకు పోషకాహార కిట్లను మంగళవారం అందించారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సాదా వెంకట్ ముగ్గురు రోగులకు 6 నెలలు పాటు పోషకాహారం కిట్లను అందించానికి ముందుకు రావటం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ రోగులు పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే పూర్తిగా వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. ఇలాగే ప్రతి గ్రామంలో రోగులకు కిట్లు అందించటానికి దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసం వెంకన్న, వైద్య సిబ్బంది కె.నాగేశ్వరరావు, పాతూరి స్నేహ, దుర్గాప్రసాద్, టి.రాజేశ్వరీ, 104 సిబ్బంది పాల్గొన్నారు.



కానూరు అగ్రహారంలో రోగులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న సాదా వెంకట్, వైద్య సిబ్బంది

వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ

ఉండ్రాజవరం: మండలంలో అన్ని గ్రామ పంచాయతీలల్లో వార్షిక సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను తయారు చేసేందుకు మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు, ఏఎస్ఎంలకు శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈశిక్షణ కార్యక్రమానికి ఆయా విభాగాల అధికారులు తప్పనిసరిగా హాజరవాలన్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ

దేవరపల్లి: పొగాకు బోర్డు స్వర్ణోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పొగాకు బోర్డు అధికారిణి పి.హేమస్మిత ఆధ్వర్యంలో హైస్కూలు ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి ఇళ్ల వద్ద నాటాలని సూచించారు. అనంతరం మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతులు పరిమి కృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, బోర్డు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న పొగాకు బోర్డు అధికారులు

రైతును శాస్త్రవేత్తగా చేయడమే లక్ష్యం

ఉండ్రాజవరం: వ్యవసాయంలో రైతును శాస్త్రవేత్తని చేయడమే పొలంబడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు చింతల శ్రీనివాసు అన్నారు. మండలంలో మోర్త, ఉండ్రాజవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోర్తలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో మేలైన వ్యవసాయ సాగు పద్ధతులతో పంట దిగుబడులు పెంచుకోవడానికి ప్రతి వారం సలహలు, సూచనలు ఇచ్చేలా ఈ కార్యక్రమాన్ని ఎంపికనిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నాలుగు సూత్రాలు ఉన్నాయని ఆరోగ్యవంతమైన నారును పెంచడం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం, ప్రతిరోజు పొలం పరిసరాలను విశ్లేషించడం, రైతును తన పొలంలో శాస్త్రవేత్తగా రూపొందించడం అని వివరించారు. రైతులు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బయోమెట్రిక్ వేసి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మెండే వెంకట్రావు, చిటికెన సుజిని, వైస్ ప్రసిడెంట్ రామ్ సందీప్, వ్యవసాయ, ఉద్యావన సహాయకులు శశి, గీత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాశీ, రైతులు పాల్గొన్నారు.



మోర్తలో రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాసు

పార్టీ నాయకుడుకి వనిత పరామర్శ

దేవరపల్లి: అనారోగ్యంతో దేవరపల్లి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని దుద్దుకూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ కృష్ణారావును మంగళవారం మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత పరామర్శించారు. ఈ మేరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు డాక్టర్ సుమంత్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పార్టీ నాయకులు పాపోలు రెడ్డిబాబు, నాయకులు పాల్గొన్నారు.



కృష్ణారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత